సాక్షి రంగారెడ్డి

ఆదివారం ǀ 19 ǀ అక్టోబర్ ǀ 2025



కారులో వచ్చి హల్‌చల్

పోలీస్ స్టిక్కర్ ఉన్న కారులో వచ్చి హల్‌చల్ చేసిన వారిని అరెస్ట్ చేసిన సంఘటన రాయదుర్గం ఠాణా పరిధిలో జరిగింది. 10లో▸



విద్యార్థులే దేశ నిర్మాతలు

దేశ భవిష్యత్తును నిర్మించేది విద్యార్థులేనని న్యూఢిల్లీ యూజీసీ జాయింట్ సెక్రటరీ గోపి చంద్ మేర్గు అన్నారు. 10లో▸



ప్రయాణికుల నిలువు దోపిడీ

ప్రైవేటు వాహనాలు బీసీ బంద్‌ను భారీగా సొమ్ము చేసుకున్నాయి. ఇదే అదనుగా రెట్టింపు వసూలు చేశాయి. 10లో▸

న్యూస్‌రీల్

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన ఆచారి



ఆమనగల్లు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 31న జరిగే తన కుమారుడు భరత్ నిశ్చితార్థానికి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటయ్య, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

లచ్చిరాంకు ఇంటర్నేషనల్ టీచర్ ఎక్సలెన్సీ అవార్డు



ఉదావత్ లచ్చిరాం

తుర్కయంజాల్: ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేయడం, దాతల ద్వారా బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు సౌకర్యాలను సమకూర్చడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని పురపాలక సంఘం పరిధి మునగనూర్‌కు చెందిన ఉదావత్ లచ్చిరాంకు ఇంటర్నేషనల్ టీచర్ ఎక్సలెన్సీ అవార్డు దక్కింది. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బీహార్‌కు చెందిన లీగ్ అకాడమిక్ ప్రొఫెషనల్ ఇంటర్ డిసిప్లినరీ సొసైటీ, నీరజ్ గ్రీన్ ఇండియా పరివార్ ఫౌండేషన్ సీఈఓలు డా. నీరజ్ గుప్తా, ప్రొఫెసర్ నార్బర్ శనివారం మెయిల్ ద్వారా సర్టిఫికెట్ పంపించినట్లు లచ్చిరాం తెలిపారు. ఈయన ప్రస్తుతం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ అవార్డు వరించడం ఎంతో సంతోషంగా ఉందని, మరింత ఉత్సాహంతో పేద విద్యార్థులకు చేయూత అందిస్తానని పేర్కొన్నారు.

బాటసింగారం ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్‌గా జైపాల్‌రెడ్డి



అబ్దుల్లాపూర్‌మెట్: రెండు నెలలుగా కొనసాగుతూ వస్తున్న బాటసింగారం రైతు సేవా సహకార సంఘం (ఎఫ్‌ఎస్‌సీఎస్) చైర్మన్ పదవీ వివాదం ఎట్టకేలకు ముగిసింది. చైర్మన్‌గా కొత్తపల్లి జైపాల్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా సహకార శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వు పత్రాన్ని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శనివారం జైపాల్‌రెడ్డికి అందజేశారు. సంఘం కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సంఘంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



శ్రీరాం కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: బస్తీల్లో సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటానని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి తెలిపారు. జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీలోని 20వ వార్డు ప్రజలు స్థానికంగా నెలకొన్న అవుట్‌లెట్ తదితర సమస్యల విషయమై ఎమ్మెల్యే సబితారెడ్డిని శనివారం ఉదయం ఆమె నివాసంలో కలిసి విన్నవించారు. స్పందించిన ఆమె వెంటనే కమిషనర్‌కు ఫోన్ చేయడంతో 40 మంది సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అనంతరం ఆమె నేరుగా శ్రీరాం కాలనీకి వచ్చి స్థానికంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయమని అన్నారు. బస్తీల్లో నెలకొన్న సమస్యలపై మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవుట్‌లెట్, దెబ్బతిన్న రహదారులకు సంబంధించి డీపీఆర్ రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూరెడ్డి కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హామెద్, సీనియర్ నాయకులు నిరంజన్, యంజాల అర్జున్, దూడల శ్రీనివాస్ గౌడ్, నవపేట ఆంజనేయులు, కర్నాటి పద్మ, వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: కాంగ్రెస్ పార్టీ నేతల ర్యాలీ



మహేశ్వరం: బీజేపీ నాయకుల నిరసన ర్యాలీ

బంద్ ప్రశాంతం

బీసీ రిజర్వేషన్లలో న్యాయమైన వాటాకోసం బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం జిల్లావ్యాప్తంగా నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. స్కూళ్లు, కాలేజీలు, విద్యాసంస్థలు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలను మూసివేశారు. ప్రజారవాణా స్తంభించింది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, వామపక్షపార్టీలు, బీసీసంఘాలు, ఎమ్మార్పీఎస్ తదితర సంఘాలకు చెందిన నాయకులు ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, ప్రదర్శనల్లో పాల్గొన్నారు. – సాక్షి, రంగారెడ్డి జిల్లా



ఇబ్రహీంపట్నం: డిపో ఎదుట ఆందోళనలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు

బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటోంది



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆమనగల్లు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటోందని ఎక్సైజ్, టూరిజం శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు మద్దతుగా ఆమనగల్లు పట్టణంలో శనివారం నిర్వహించిన బంద్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు దక్కాల్సిందేనని అన్నారు. ఇందులో భాగంగా కులగణన నిర్వహించిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిందని, ఈ విషయమై అసెంబ్లీలో చర్చించి, ఆమోదించించిన అనంతరం గవర్నర్, కేంద్ర ప్రభుత్వానికి పంపించామని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లగా రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించిందని, అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లిందని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక నాయకులు గుర్రం కేశవులు, శివలింగం, చుక్క అల్లాజీగౌడ్, కాసోజు రాము తదితరులు ఉన్నారు.



చేవెళ్ల: బస్సులు రాక ఖాళీగా ఉన్న బస్‌స్టేషన్



ఆమనగల్లు: బీసీ ఐక్యవేదిక నాయకుల మానవహారం



చేవెళ్ల: ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

చివరి రోజు జోరు



బండ్లగూడ జాగీర్ ఎక్సైజ్ అకాడమీలో దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చిన వ్యాపారులు

- మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు
- శనివారంతో ముగిసిన గడువు
- రాత్రి పొద్దుపోయే వరకు స్వీకరణ
- జిల్లాలో 249 షాపులకు టెండర్లు ఆహ్వానం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మద్యం షాపులకు 2025–27 కాలానికి నిర్వహించిన టెండర్లలో చివరి రెండు రోజులు దరఖాస్తు దారులు పోటెత్తారు. మొదట్లో దరఖాస్తుల సమర్పణ మందకొడిగా సాగినప్పటికీ శనివారం ఆఖరి రోజు కావడం, దీపావళి ముందు వచ్చే ధంతేరాస్ శుభానికి సూచికగా భావిస్తుండటంతో మెజార్టీ వ్యాపారులు క్యూ కట్టారు. జిల్లాలోని శంషాబాద్, సరూర్‌నగర్ ఎక్సైజ్ జిల్లాల పరిధిలోని షాపులకు బండ్లగూడ జాగీర్ ఎక్సైజ్ అకాడమీలో దరఖాస్తులను స్వీకరించారు. 249 మద్యం షాపులకు రాత్రి 8 గంటల వరకు శంషాబాద్ డివిజన్ పరిధిలో 6,012, సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 5,800 దరఖాస్తులు అందాయి. గతంలో నిర్వహించిన టెండర్లకు జిల్లా వ్యాప్తంగా 21,615 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.432.3 కోట్ల ఆదాయం సమకూరగా, గతంతో పోలిస్తే ఈసారి దరఖాస్తు ఫీజును రూ.3 లక్షలకు పెంచినప్పటికీ ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో ఆదాయం తగ్గినట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ గర్భిణి మృతి



ఆందోళన వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆందోళన



మానస (ఫైల్)

మంచాల: చికిత్స పొందుతూ గర్భిణీ మృతి చెందింది. ఆమె మృతికి ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన మంచాల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన పంతంగి మానస (26) ఏడు నెలల గర్భిణి. వైద్యం కోసం భర్త మధుతో కలిసి శుక్రవారం ఉదయం మంచాల ప్రభుత్వ వైద్యశాలకు వచ్చింది. అక్కడి వైద్యురాలు పరీక్షించి బలం తక్కువగా ఉందని, గ్లూకోజ్ ఎక్కించారు. కొద్ది సేపటికే ఆమె లోబీపీతో స్పృహ తప్పి పడిపోయింది. దీంతో వెంటనే ఇబ్రహీంపట్నంలో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు నగరంలోని కోఠి ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడి వైద్యులు పరీక్షించి ఉస్మానియా వైద్యశాలకు పంపించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఆమె మృతి చెందింది.

న్యాయం చేయాలంటూ..

మంచాల ప్రభుత్వ ఆస్పత్రి నిర్లక్ష్యంతో మానస మరణించిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని, తమరే న్యాయం చేయాలంటూ మంచాల– ఆరుట్ల రోడ్డుపై బైఠాయించారు. వారికి వివిధ పార్టీల నాయకులు మద్దతుగా నిలిచారు. సమాచారం అందుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఘటనా స్థలానికి చేరుకున్నారు. విషయాన్ని ఫోన్‌లో కలెక్టర్, జిల్లా వైద్యాధికారులు, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అక్కడికి వచ్చిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధామాధవి వారి సర్ది చెప్పారు. రూ.లక్ష అందిస్తామని తెలిపారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

కష్టపడిన వారికే పార్టీ పదవులు

ఏఐసీసీ పరిశీలకుడు, ఎంపీ రాబర్ట్ బ్రూస్




అభిప్రాయాలు సేకరిస్తున్న పార్టీ అగ్రనేతలు

తుక్కుగూడ: కష్టపడిన వారికే పార్టీ పదవులు దక్కుతాయని ఏఐసీసీ పరిశీలకుడు, తిరునల్వేలి ఎంపీ రాబర్ట్ బ్రూస్ అన్నారు. మున్సిపల్ కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శనివారం డీసీసీ అధ్యక్షుడి ఎంపికపై పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. పార్టీ పదవుల్లో యువత, మహిళలకు పెద్దపీట వేస్తామన్నారు. డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక కోసం జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనిత, నాయకులు దేప భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో పోటీకి ఫార్మా బాధితులు రెడీ

- ఎలక్టోరల్ రోల్ కాపీల అందజేతలో ఆర్డీఓ నిర్లక్ష్యం
- కొంతమందికే సర్టిఫైడ్ కాపీల అందజేత
- ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన రైతులు



ఎలక్టోరల్ రోల్ కాపీలను చూపిస్తున్న రైతులు

యాచారం: జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచేందుకు ఫార్మాసిటీ భూ బాధితులు రెడీ అయ్యారు. సుమారు యాభై మందికిపైగా పోటీలో ఉండాలని భావించినప్పటికీ ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత్‌రెడ్డి తమకు సకాలంలో ఎలక్టోరల్ రోల్ కాపీలు అందజేయలేదని తెలిపారు. శనివారం రాత్రి 7 గంటల వరకు కార్యాలయం వద్దే వేచిచూశామని, ఓపిక నశించి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో 7 గంటల తర్వాత కొందరికి మాత్రమే ఇచ్చారని వివరించారు. తాము బరిలో ఉంటే ప్రభుత్వానికి అంత భయమెందుకని ప్రశ్నించారు. ఆదివారం నామినేషన్లు సమర్పిస్తామని తెలిపారు.

మరింత ‘విలువ’!

- భూముల మార్కెట్ వాల్యూ సవరణ
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- 40 నుంచి 50 శాతం పెరిగే అవకాశం
- అన్ని లింకులు పరిశీలించాకే ఆస్తుల రిజిస్ట్రేషన్
- అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా సేవలు
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ జిల్లా అధికారి సంతోష్



పత్రాలన్నీ పరిశీలించిన తర్వాతే..

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ‘ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ వాల్యూకు.. బహిరంగ మార్కెట్లోని భూముల విలువకు భారీ వ్యత్యాసం ఉంది. ఈ లోపాన్ని సరిదిద్దేందుకు ప్రభుత్వం భూముల మార్కెట్ విలువను సవరించాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలోని ఓఆర్‌ఆర్ లోపల ఉన్న భూముల మార్కెట్ విలువను సవరిస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి నివేదించాం. ప్రాంతాన్ని, భూ స్వరూపాన్ని, అక్కడ ఉన్న మౌలిక సదుపాయాలను, డిమాండ్‌ను బట్టి ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువను 40 నుంచి 50 శాతం పెంచాలని ప్రతిపాదించాం’ అని జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల విభాగం అధికారి సంతోష్ మందల చెప్పారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ‘సాక్షి’కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన మాటల్లోనే..

ప్రభుత్వానిదే తుది నిర్ణయం

ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత 2021లో భూముల మార్కెట్ విలువను 20 శాతం పెంచుతూ అప్పటి ప్రభుత్వం తొలిసారిగా నిర్ణయం తీసుకుంది. తర్వాత 2022లో 33 శాతం పెంచింది. తాజాగా మరోసారి భూ విలువను సవరించేందుకు సిద్ధమైంది. మార్కెట్ విలువల్లో హెచ్చుతగ్గులపై ఇప్పటికే కసరత్తు చేశాం. స్థానికంగా ఉన్న వాణిజ్య పరమైన డిమాండ్‌ను, మౌలిక సదుపాయాలను బట్టి 40 నుంచి 50 శాతం, కొన్నిచోట్ల అంతకు మించి విలువ పెంచాలని నిర్ణయించాం. ప్రస్తుతం ఈ ప్రతిపాదన లు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. తుది నిర్ణయం తీసుకోవాల్సింది ప్రభుత్వమే.

ఆ వ్యత్యాసాన్ని పూడ్చేందుకే..

గచ్చిబౌలిలో అపార్ట్‌మెంట్‌కు సంబంధించి చదరపు అడుగు ధర ప్రస్తుతం రూ.3000 ఉంది. దీన్ని కనీసం 60 శాతం (రూ.4,800) పెంచాలని ప్రతిపాదించాం. నార్సింగి, మణికొండ, రాయదుర్గం, నానక్‌రాంగూడ, కోకాపేట్, తదితర ప్రాంతాల్లోని వ్యాణిజ్య భూములు బహిరంగ మార్కెట్లో ఎకరం రూ.వంద కోట్లకు పైనే పలుకుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్‌లోని భూ విలువ ఆధారంగా ప్రధాన రోడ్ల వెంట గజం ధరను రూ.లక్ష వరకు పెంచాలని ప్రతిపాదించాం. ఇక మహేశ్వరంలో పుస్తక విలువ రూ.2,100 మాత్రమే ఉంది. అదే వాణిజ్య స్థలం విలువ రూ.10,200 ఉంది. ఇలాంటి చోట్ల రూ.2,100 ఉన్న విలువను కనీసం రూ.3,800 నుంచి రూ.4,500 వరకు పెంచాలని ప్రతిపాదించాం.

పత్రాలన్నీ పరిశీలించిన తర్వాతే..

వివాదాస్పద స్థలాల డబుల్ రిజిస్ట్రేషన్లకు కారణమవుతున్న నకిలీలపై నిఘా ఏర్పాటు చేశాం. ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు ముందు క్రయవిక్రయదారులకు సంబంధించిన ప్రతి లింకు డాక్యుమెంట్‌ను పరిశీలిస్తున్నాం. ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే పోలీసు కేసు నమోదు చేయిస్తున్నాం. వివాదాస్పద స్థలాలను, డాక్యుమెంట్లను నిషేధిత జాబితాలో చేర్చుతున్నాం. దళారులు, దస్తావేజు లేఖరుల సహాయం లేకుండా నేరుగా స్లాట్ బుక్ చేసుకుని వచ్చే వారికి పారదర్శకంగా సేవలు అందిస్తున్నాం. అక్రమ వసూళ్లు, అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడే ఎస్‌ఆర్‌ఓలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. పరిగిలో ఇప్పటికే ఇద్దరు అధికారులను సస్పెండ్ చేశాం. వనస్థలిపురం పార్కు స్థలం రిజిస్ట్రేషన్ విషయంలో విచారణకు ఆదేశించాం.

మెరుగైన సేవల కోసం..

జిల్లాలో నెలకు సగటున 21 వేల నుంచి 22 వేల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు అవుతుంటాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి ప్రతి నెలా రూ.350 నుంచి రూ.360 కోట్ల ఆదాయం సమకూరుతుంది. ప్రభుత్వానికి భారీగా ఆదాయాన్ని సమకూర్చిపెడుతున్న రిజిస్ట్రేషన్ల శాఖకు పక్కా భవనాలు లేవు. ఉన్న వాటిలో కనీస మౌలిక సదుపాయాలు లేవు. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల 39 సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులున్నాయి. వీటిలో మెజార్టీ ఆఫీసులు కనీస వసతులు లేని ఇరుకైన అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రతి మూడు, నాలుగు ఎస్‌ఆర్‌ఓలకు ఒక ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

దళారులపై ఆంక్షలు

ఇప్పటికే శేరిలింగంపల్లిలో మూడు ఎకరాల భూమిని కేటాయించి, ఇటీవలే శంకుస్థాపన కూడా చేసింది. పటాన్‌చెరు, కండ్లకోయ, కోహెడ, మంఖాల్, బంజారాహిల్స్, మలక్‌పేట్, మల్లాపూర్, గాజులరామారం, బోయిన్‌పల్లి, కూకట్‌పల్లి, ఎల్బీనగర్‌లో ఇంటిగ్రేటెడ్ భవనాలు అందుబాటులోకి రానున్నాయి. పాస్‌పోర్ట్ కార్యాలయం తరహాలో స్లాట్‌బుక్ చేసుకున్న వారికే లోనికి అవకాశం ఉంది. దస్తావేజులేఖరులు, దళారుల రాకపోకలపై పూర్తి నియంత్రణ ఉంటుంది.

పోలీస్ స్టిక్కర్ ఉన్న కారులో వచ్చి హల్‌చల్

- ల్యాంకోహిల్స్‌లో సెక్యూరిటీ గార్డులపై దాడి
- 15 మందిపై కేసు నమోదు
- ఐదుగురి అరెస్ట్


దాడి చేసేందుకు వచ్చిన వ్యక్తులు

గచ్చిబౌలి: పోలీస్ స్టిక్కర్ ఉన్న కారులో వచ్చి సెక్యూరిటీ గార్డులపై దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ల్యాంకోహిల్స్ బ్లాక్ 3ఎల్‌హెచ్‌లో మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ఓ ఐపీఎస్ అధికారి తల్లి అద్దెకు ఉంటోంది. ఈ నెల 15న ఉదయం వినాయక రెడ్డి అనే వ్యక్తి ల్యాంకోహిల్స్‌లోని ఫ్లాట్ నెంబర్ 1703కి వెళ్లేందుకు వచ్చాడు. విజిటర్స్ లైన్‌లో కాకుండా రెసిడెన్సీ లైన్‌లో వెళ్లడంతో సెక్యూరిటీ సిబ్బంది అతడిని అడ్డుకున్నారు. పాస్ ఇవ్వడం లేదని చెప్పడంతో ఫ్లాట్ నెంబర్ 1703 నుంచి మురళి అనే వ్యక్తి కిందికి వచ్చాడు. వచ్చీరావడంతో అతను గొడవకు దిగడంతో సెక్యూరిటీగార్డు బాలకృష్ణ అతడిని తోశాడు. దీంతో మురళి సెక్యూరిటీ గార్డుపై చేయడంతో అతను ప్రతి దాడి చేశాడు. అక్కడి నుంచి వెళ్లిపోయిన మురళి సాయంత్రం మరి కొందరితో కలిసి వచ్చి సెక్యూరిటీ గార్డులైన బాలకృష్ణ, చంద్‌లపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో దాదాపు 15 మంది పాల్గొన్నట్లు ఆరోపిస్తూ బాధితులు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు 10 మందికి నోటీసులు ఇచ్చి పంపారు. మరో ఐదురుగురు పరారీలో ఉన్నారు. ఇది ఇలా ఉండగా దాడి చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ సెక్యూరిటీ గార్డులు శనివారం ల్యాంకోహిల్స్‌కు వెళ్లే దారిలో ఆందోళన చేపట్టారు. ఇప్పటికే కేసు నమోదు చేశామని, మరో ఐదుగురు పరారీలో ఉన్నారని రాయదుర్గం పోలీసులు సర్దిచెప్పడంతో వారు ఆందోళన విరమించారు. అయితే ఆ తర్వాత కొద్ది సేపటికే పరారీలో ఉన్న ఐదుగురు వ్యక్తులు పోలీస్ స్టిక్కర్‌ఉన్న కారులో వచ్చి రాయదుర్గం పెట్రోల్ మొబైల్ సిబ్బంది చూస్తుండగానే సిబ్బందిపై దాడికి పాల్పడటంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మహారాష్ట్ర క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ ఆఫీసర్ కేసును అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. నోటీసులతో సరిపెట్టాలని సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారులను కోరినా అందుకు నిరాకరించి రిమాండ్ చేసినట్లుగా సమాచారం.

ఏసీబీ వలలో విద్యుత్ శాఖ ఏఈ

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ గంధంగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ హిమాయత్ సాగర్ సెక్షన్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అమర్‌సింగ్ రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. హైదరాబాద్ ఏసీబీ సిటీ రెంజ్ డీఎస్పీ .శ్రీనివాస్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఏఆర్‌సీకే ప్రాజెక్ట్స్ అపార్ట్‌మెంట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు కాంట్రాక్టర్ ఏఈ అమర్ సింగ్‌ను సంప్రదించగా అతను రూ.30 వేలు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పథకం ప్రకారం సదరు కాంట్రాక్టర్ శనివారం అసిస్టెంట్ ఇంజనీర్ అమర్‌సింగ్‌కు నగదు అందజేస్తుండగా పోలీసులు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ. 30 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏఈని అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జిమ్ నిర్వాహకుడిపై కేసు

సాక్షి, సిటీబ్యూరో: మందుల తయారీ, నిల్వలు, వినియోగంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ సాహ్నవాజ్‌ఖాసిం అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ పరిధిలోని నామాలగుండులో ఓ జిమ్‌పై దాడులు నిర్వహించిన అధికారులు పెద్ద మొత్తంలో అక్రమంగా నిల్వ ఉంచిన మెఫెంటెర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. కార్డియాక్ స్టిమ్యులేట్ అవసరాలకు వినియోగించే మందును జిమ్‌లో బాడీ బిల్డర్స్‌కు అక్రమంగా విక్రయిస్తున్నారని గుర్తించారు. దీంతో జిమ్ నిర్వాహకుడు నరేష్‌పై చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు. దాడుల్లో డి.సరిత, గోవింద్ సింగ్, రేణుక, సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

నిమ్స్‌లో ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం



లక్డీకాపూల్ : ఎలక్ట్రిక్ బైక్ దగ్ధమైన సంఘటన శనివారం నిమ్స్ మార్చురీ సమీపంలోని స్టాఫ్ పార్కింగ్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెలితే ఆస్పత్రిలో పని చేస్తున్న అన్‌స్కిల్డ్ వర్కర్ బాలచందర్ తన ఈవీ బైక్‌ను స్టాఫ్ పార్కింగ్‌లో పార్క్ చేసి విధులకు హాజరయ్యాడు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో పార్క్ చేసిన వాహనం నుంచి పొగలు రావడాన్ని గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో అప్రమత్తమైన నిమ్స్ సెక్యూరిటీ అధికారి రామారావు వాహనాన్ని సిబ్బంది సహాయంతో స్టాఫ్ పార్కింగ్ నుంచి బయటకి తీయించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే ఆ వాహనం నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో బైక్ పూర్తిగా దగ్ధమైంది.

ప్రయాణికుల నిలువు దోపిడీ

బీసీ బంద్‌ను భారీగా సొమ్ము చేసుకున్న ప్రైవేట్ వాహనాలు

- ఎక్కడికక్కడ నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు
- దీపావళి సందర్భంగా సొంత ఊళ్లకు తరలిన జనం ఇక్కట్లు



సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేట్ వాహనాలు బీసీ బంద్‌ను భారీగా సొమ్ము చేసుకున్నాయి. దీపావళి వేడుకలు, వరుస సెలువుల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి సొంత ఊళ్లకు బయలుదేరిన నగరవాసుల పైన దారిదోపిడీకి పాల్పడ్డాయి. సాధారణ రోజుల్లో విధించే చార్జీలపైన రెట్టింపు వసూలు చేశాయి. బంద్ సందర్భంగా సిటీబస్సులతో పాటు దూరప్రాంతాలకు వెళ్లే బస్సులు సైతం నిలిచిపోయాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎక్కడికక్కడ డిపోలకే పరిమితమయ్యాయి. మహాత్మాగాంధీ, జూబ్లీ బస్‌స్టేషన్ల నుంచి జిల్లాలకు రాకపోకలు సాగించే బస్సులను కూడా నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.అప్పటికే బస్‌స్టేషన్‌లకు చేరుకున్న ప్రయాణికులు ఏదో ఒకవిధంగా సొంత ఊళ్లకు వెళ్లేందుకు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. దీంతో క్యాబ్‌లు, టాటాఏస్‌లు, మ్యాక్సీక్యాబ్‌లు, తదితర వాహనదారులు అడ్డగోలుగా దోచుకున్నాయి. గత్యంతరం లేకపోవడంతో ఎక్కువ చార్జీలను చెల్లించి వెళ్లాల్సి వచ్చింది. బీసీ బంద్ దృష్ట్యా హైదరాబాద్ నుంచి తెలుగు రాష్ట్రాలకు రాకపోకలు సాగించే సుమారు 3500 బస్సులు స్తంభించాయి. మరోవైపు నగరంలోని 25 డిపోల్లో మరో 2850 కి పైగా సిటీ బస్సులు సైతం డిపోలకే పరిమితమయ్యాయి. వీకెండ్ కావడంతో వివిధ అవసరాల నిమిత్తం ఇంటి నుంచి బయటికి వచ్చిన జనాన్ని ఆటోవాలాలు దోచుకున్నారు.సెవెన్ సీటర్ ఆటోలు, శేర్ ఆటోల్లో సైతం రెట్టింపు చార్జీలు వసూలు చేశారు.

ఇష్టారాజ్యంగా వసూళ్లు...

ఓలా, ఉబెర్, ర్యాపిడ్ వంటి సంస్థలతో అనుసంధానమయ్యే క్యాబ్ డ్రైవర్‌లు తమ వాహనాలను బంద్ దృష్ట్యా జిల్లాలకు మళ్లించారు. మరోవైపు పలు ఐటీ సంస్థలకు వాహనాలను నడిపే ట్రావెల్ ఏజెంట్‌లు సైతం దీపావళి రద్దీని సొమ్ము చేసుకొనేందుకు రోడ్డెక్కాయి. ఉప్పల్, ఎల్బీనగర్, జేబీఎస్, ఆరాంఘర్, బీఎన్‌రెడ్డినగర్, తదితర ప్రాంతాల నుంచి జిల్లాలకు రాకపోకలు సాగించాయి. ప్రయాణికుల రద్దీకనుగుణంగా వివిధ ప్రాంతాల్లో ప్రైవేట్ క్యాబ్‌లు బారులు తీరాయి. ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి హన్మకొండ వరకు ఆర్టీసీ లగ్జరీ బస్సుల్లో రూ.250 నుంచి రూ.300 వరకు చార్జీ ఉంటుంది. సాధారణ రోజుల్లో ఈ రూట్‌లో రాకపోకలు సాగించే క్యాబ్‌లు సైతం ఈ చార్జీలను వసూలు చేస్తాయి. కానీ బంద్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని క్యాబ్‌వాలాలు రూ.500 నుంచి రూ.700 వరకు వసూలు చేయడం గమనార్హం. ఎల్బీనగర్ నుంచి విజయవాడ, ఖమ్మం, సూర్యాపేట్, నల్లగొండ, తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు సైతం ఇదేవిధంగా క్యాబ్‌వాలాల దారిదోపిడీకి గురయ్యారు.

మెట్రోలు ఫుల్...

బీసీబంద్ దృష్ట్యా మెట్రో రైళ్లు కిక్కిరిశాయి. నాగోల్-రాయదుర్గం, ఎల్బీనగర్-ఎంజీబీఎస్ రూట్‌లలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి సికింద్రాబాద్, నాంపల్లి రైల్వేస్టేషన్‌లకు వెళ్లే ప్రయాణికులు మెట్రోలను ఆశ్రయించారు. మరోవైపు ఆటోరిక్షాలకు సైతం డిమాండ్ పెరిగింది. ఓలా, ఉబెర్, ర్యాపిడో ఆటోల్లోనూ చార్జీలు అమాంతంగా పెరిగాయి.బంద్ కారణంగా ఆసుపత్రులకు వెళ్లే వారు, అత్యవసర పనుల పైన బయటకు వెళ్లిన వాళ్లు పెద్ద మొత్తంలో సమర్పించుకోవాల్సి వచ్చింది.

బంద్ ప్రశాంతం...

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు మద్దతుగా అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, బీసీ సంఘాలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. ప్రజారవాణా స్తంభించినప్పటికీ బంద్ ప్రశాంతంగా కొనసాగింది. సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, తదితర వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, తెలంగాణ జనసమితి అధ్యక్షులు కోదండరాం, తదితరులు నారాయణగూడ వైఎంసీఏ నుంచి కాచిగూడ చౌరస్తా, కోఠీ , సుల్తాన్ బజార్, రామకోఠీ, బొగ్గులకుంట మీదుగా అబిడ్స్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అరుణోదయ సాంస్కృతి సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క, సీపీఐ సీనియర్ నాయకులు నారాయణ, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ , సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు గోవర్ధన్, తెలంగాణ జన సమితి నాయకులు ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు, సీపీఐఎల్ ఎల్ మాస్ లైన్ హన్మేష్, గదేగోని రవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే దేశ నిర్మాతలు


ఎంబీఏ విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న అతిథులు

మొయినాబాద్: దేశ భవిష్యత్తును నిర్మించేది విద్యార్థులేనని న్యూఢిల్లీ యూజీసీ జాయింట్ సెక్రటరీ గోపిచంద్ మేర్గు అన్నారు. అరిస్టాటిల్ పీజీ కళాశాలలో శనివారం 21వ పట్టభద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 2025 బ్యాచ్‌కు చెందిన 170 మంది ఎంబీఏ స్టూడెంట్లకు పట్టాలు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఎస్.కావ్య, కె.అర్చనకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి బాబురావు ఘట్లమనేని, ప్రిన్సిపల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


నరేష్ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్ : ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా యెర్కారం గ్రామానికి చెందిన బొర్ర నరేష్ (22) కొంతకాలంగా కుటుంబసభ్యులతో కలిసి నగరంలోని షేక్‌పేట మండలం ఫిల్మ్‌నగర్‌లో నివసిస్తున్నాడు. కాలుష్య తనిఖీ వాహనంలో పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రితం తాను దుబాయ్ వెళ్తున్నానని, తన ఫోన్ కలవదని చెప్పి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. నరేష్ కనిపించడం లేదంటూ రాయదుర్గం పోలీస్‌స్టేషన్ సెప్టెంబర్ 30న సోదరుడు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో మండల పరిధిలోని కవాడిపల్లి గ్రామ శివారులో ఉన్న పెద్దగుట్టపై శనివారం ఉదయం ఓ చెట్టుకు యువకుడి మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. అక్కడ లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా అతని కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి సోదరుడు నవీన్ పేర్కొన్నాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దుండిగల్: డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది..పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శనివారం సాయంత్రం గండిమైసమ్మ చౌరస్తాలోని డీపోచంపల్లి యూటర్న్ వద్ద బైక్‌పై వెళుతున్న వ్యక్తిని వెనుక నుంచి వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి జేబులో దొరికిన ఆధార్ కార్డు ఆధారంగా అతడిని అన్నారం గ్రామానికి చెందిన కుమారస్వామి(38)గా గుర్తించారు. డీసీఎం వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్లతో అసభ్యకరమైన కంటెంట్..

రెండు యూట్యూబ్ చానళ్లపై కేసులు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: సోషల్‌మీడియాలో స్వేచ్ఛ ఉంది కదా అని.. ఏ తరహా కంటెంట్ అయినా చేస్తామంటే కుదరదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. మైనర్లతో అసభ్యకరమైన కంటెంట్ చేసిన రెండు యూట్యూబ్ చానళ్లపై హైదరాబాద్ సైబర్ క్రై మ్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వ్యూస్, లైక్స్ తో పాటు సోషల్ మీడియాలో ఫేమస్ కావడం కోసం చిన్నారులతో అసభ్యకర కంటెంట్ చేయకూడదన్నారు. ఇది బాలల హక్కుల ఉల్లంఘన మాత్రమే కాదని చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇలాంటి చర్యలు చేసే వారిపై పోక్సో, జువైనల్ జస్టిస్ యాక్ట్ తదితర చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇలాంటి వీడియోలు దృష్టికి వస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ఓటరు జాబితాపై తప్పుడు ప్రచారం వ్యాప్తి చేస్తున్న వ్యక్తిపై కేసు

ఫిలింనగర్: ఓటరు గుర్తింపు కార్డులో తప్పుడు చిరునామాలు, రాజకీయ నాయకుల పేర్లు, ఫొటోలు మార్ఫింగ్ చేసి అసత్య ప్రచారం చేయడమే కాకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తున్న వ్యక్తిపై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. గత కొద్ది రోజులుగా ఓ వ్యక్తి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తూ ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టిస్తున్నాడని, సామాజిక మాధ్యమాల్లో ఓటరు జాబితాపై తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారంటూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసుఫ్‌గూడ సర్కిల్-19 అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ బాలరాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్టు


నిందితుడు కొప్పర్తి శ్రీను

షాద్‌నగర్: భూమిని కౌలుకు తీసుకొని అక్రమంగా గంజాయి మొక్కలు సాగు చేస్తున్న వ్యక్తిని శనివారం కేశంపేట పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నరహరి కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూరు గోదావరికి చెందిన కొప్పర్తి శ్రీను కొంత కాలం క్రితం కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి వచ్చాడు. గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద కొంత భూమిని కౌలుకు తీసుకున్నాడు. ఆ భూమిలో గుట్టుగా గంజాయి మొక్కలను సాగు చేశాడు. సమాచారం అందుకున్న ప్రత్యేక పోలీసు బృందం తనిఖీ చేసి గంజాయి మొక్కలను గుర్తించారు. ఈ మేరకు కొప్పర్తి శ్రీనును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ ప్రకటన

కొంగర కలాన్ గ్రామం భూమి, ఇబ్రహింపట్నం మండలం, రంగారెడ్డి జిల్లా.

సాధారణ ప్రజలకు తెలియచేయునదేమనగా, నా క్లయింటు **మెసర్స్ ఫ్యూచర్‌మైండ్స్ నెట్‌వర్క్ ఎల్‌ఎల్‌పి**, ఆఫీసు: విల్లా నం.56, అంతం విస్తాస్, కొంపల్లి, జీవికె ఇఎంఆర్ఎల్ తరువాత, హాకీంపేట్, మేడ్చల్, తిరుమలగిరి, హైదరాబాద్-500014, వారు షెడ్యూలులో తెలిపిన ఆస్తి నిమిత్తం, దిగువ తెలిపిన భూమి యజమానులు మరియు స్వాధీనంలో ఉంచుకొన్నవారితో లీజు ఒప్పందం కుదుర్చుకొన్నారు.

1. శ్రీమతి నోముల లత, భర్త పేరు నోముల అశోక్, భూమి విస్తీర్ణం ఎ.1-31 గుంటలు, సర్వే నం.64ఇ, భూమి విస్తీర్ణం ఎ.2-28 గుంటలు, సర్వే నం.65ఇ, భూమి విస్తీర్ణం ఎ 3-21 గుంటలు, సర్వే నం.66ఇ.
2. శ్రీ తాళ్ల నర్సింహ, తండ్రి పేరు తాళ్ల చంద్రయ్య, భూమి విస్తీర్ణం ఎ.0-06 గుంటలు, సర్వే నం.65అ/1/1/1/1, భూమి విస్తీర్ణం ఎ 0-01, సర్వే నం.66అ/1/1/1/1/1 మరియు భూమి విస్తీర్ణం ఎ.0-18 సర్వే నం.66అ/1/1/1/1/2/1/1
3. శ్రీమతి తాళ్ల కీర్తన, తండ్రి పేరు తాళ్ల నర్సింహ, భూమి విస్తీర్ణం ఎ.0-06, సర్వే నం.66అ/1/1/1/1/2/1/2
4. శ్రీమతి తాళ్ల పూజ, తండ్రి పేరు తాళ్ల నర్సింహ, భూమి విస్తీర్ణం ఎ.0-06. సర్వే నం.66అ/1/1/1/1/2/2
5. శ్రీమతి దేశగోని అంబిక, తండ్రి పేరు తాళ్ల నర్సింహ, భూమి విస్తీర్ణం ఎ0-10గుంటలు, సర్వే నం.66అ/1/2
6. శ్రీ తాళ్ల మహేందర్, తండ్రి పేరు తాళ్ల చంద్రయ్య, భూమి విస్తీర్ణం, ఎ.0-10 గుంటలు, సర్వే నం.65అ/1/1/2, భూమి విస్తీర్ణం ఎ 0-10, సర్వే నం.66అ/1/1/1/2 మరియు భూమి విస్తీర్ణం ఎ.0-10, సర్వే నం.66అ/1/1/2
7. శ్రీ తాళ్ల రాజు గౌడ్, తండ్రి పేరు తాళ్ల చంద్రయ్య, భూమి విస్తీర్ణం ఎ. 0-23 గుంటలు, సర్వే నం. 65అ/2 మరియు భూమి విస్తీర్ణం ఎ.0-10 గుంటలు సర్వేనం. 66అ/2.
8. శ్రీ సాతు క్రిష్ణ తండ్రి పేరు సాతు మల్లయ్య, భూమి విస్తీర్ణం ఎ.0-20 గుంటలు, సర్వే నం. 65రు మరియు భూమి విస్తీర్ణం ఎ.0-20 గుంటలు సర్వే నం. 67రు/1/1
9. శ్రీమతి సాతు బాలమణి, భర్త పేరు సాతు క్రిష్ణ, భూమి విస్తీర్ణం ఎ1-09 గుంటలు, సర్వే నం.65 ఉ/అ మరియు భూమి విస్తీర్ణం ఎ0-31, సర్వే నం.66ఈ/1/1
10. శ్రీమతి మారమోని పావని, భర్త పేరు మారమోని శ్రీనివాస్, భూమి విస్తీర్ణం ఎ0-20 గుంటలు, సర్వే నం.66ఈ/1/2 మరియు భూమి విస్తీర్ణం ఎ0-20, సర్వే నం.67రు/1/2
11. శ్రీమతి ఆవుల భార్గవి, భర్త పేరు ఆవుల వీరేశం, భూమి విస్తీర్ణం ఎ0-20 గుంటలు, సర్వే నం. 66ఈ/2 మరియు భూమి విస్తీర్ణం ఎ0-20, సర్వే నం.67రు/2
12. శ్రీ కర్రె తిరుమలేశ్, తండ్రి పేరు కర్రె కిష్టయ్య, భూమి విస్తీర్ణం ఎ.0-20 గుంటలు, సర్వే నం. 67రూ/1/1
13. శ్రీ కర్రె మల్లేశ్, తండ్రి పేరు కర్రె కిష్టయ్య, భూమి విస్తీర్ణం ఎ0-20 గుంటలు, సర్వే నం. 67రూ/2
14. శ్రీ కర్రె యాదయ్య, తండ్రి పేరు కర్రె కిష్టయ్య, భూమి విస్తీర్ణం ఎ.0-20 గుంటలు, సర్వే నం.65రూ
15. శ్రీ కర్రె జంగయ్య, తండ్రి పేరు కర్రె కిష్టయ్య, భూమి విస్తీర్ణం ఎ.0-20 గుంటలు, సర్వే నం. 67రూ/1/2.

మరియు వారికి గణనీయమైన సొమ్మును చెల్లించారు. ఏ వ్యక్తికి అయినా ఏ క్లెయిము, ఆక్షేపణ, లేదా ప్రయోజనం కనుక షెడ్యూలు ఆస్తి నిమిత్తం ఉంటే వారు తమ ఏవేని ఆక్షేపణలను లిఖితపూర్వకంగా డాక్యుమెంటరీ రుజువులతో దిగువ సంతకందారుకు ఈ ప్రచురణ తేది నుంచి 15 రోజులలోగా దాఖలు చేయవలెను, లేని ఎడల ఏ విధమైన ఆక్షేపణలు లేవని భావించబడును మరియు అ తరువాత లేవనెత్తిన ఆక్షేపణలు పరగణించబడవు.

ఆస్తి షెడ్యూలు.

కొంగరకలాన్ గ్రామం, ఇబ్రహింపట్నం మండలం, రంగారెడ్డి జిల్లాలో పైన తెలిపిన సర్వే నం.లలోని మొత్తం ఎ. 17-31 గుంటల విస్తీర్ణం గల భూమి. హద్దులు: ఉత్తరం:నోముల అశోక్, ప్రకాష్ మరియు ఇతరుల భూమి, దక్షిణం: సత్తి రెడ్డి భూమి తూర్పు: పిరంగి కాలువ రోడ్డు. పడమర: నారాయణ స్వామి, గోవర్ధన్‌రెడ్డి మరియు ఇతరులు.

స్థలం: హైదరాబాద్,
తేది:17.10.2025.

సం/-
జి.క్రిష్ణ, బి.కాం, ఎల్ఎల్.బి న్యాయవాది.
ఇ.నం. 11-99, ప్రశాంతి నగర్ కాలని, రోడ్ నం.4, విజయదుర్గ భవాని గుడి వద్ద, శేరిలింగంపల్లి, హైదరాబాద్-500019Ph: 97044-40216.